క్లుప్తంగా

హైకోర్టు జడ్జి కృష్ణమోహన్‌ను కలిసిన ఏఎస్పీ



రాష్ట్ర హైకోర్టు జడ్జి కృష్ణమోహన్‌కు పూలకుండీ అందజేసిన అదనపు ఎస్పీ స్వరూపరాణి

ఏలూరు టౌన్‌: ఏలూరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం జడ్జి బీ.కృష్ణ మోహన్‌ను ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ జీ.స్వరూపరాణి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలకుండీని అందజేశారు. జస్టిస్‌ కృష్ణమోహన్‌ ఏలూరులో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకాగా ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



ఏలూరు జోన్‌ ఏపీటీఎఫ్‌ సమావేశంలో మాట్లాడుతున్న బీఏ సాల్మన్‌రాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నూతనంగా ఎన్నికైన ప్రభుత్వం రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్‌ రాజు కోరారు. శనివారం స్థానికంగా నిర్వహించిన ఏపీటీఎఫ్‌ ఏలూరు జోన్‌ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని, వీలైనంత త్వరగా 117 జీఓను రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్‌ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తాళ్ళూరి రామారావు, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాస్‌, జిల్లా సబ్‌ కమిటీ సభ్యుడు డీకేఎస్‌ఎస్‌ ప్రకాష్‌, ద్వారకాతిరుమల మండల ప్రధాన కార్యదర్శి నీలి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో భారీ వర్షం

ఉంగుటూరు: ఉంగుటూరులో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో ఖరీఫ్‌ సాగు ప్రారంభించిన రైతులకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడనుంది. డెల్టాలో, మెట్టలో పొలాల్లో దమ్ము చేసేందుకు ఈ వర్షం దోహదం చేస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ వర్షం ఖరీఫ్‌ సీజను ప్రారంభానికి వ్యవసాయ పనులు ముందుకు వెళ్లడానికి ఉపయోగంగా మారింది.

ప్రతి విద్యార్థీ పాఠశాలలో ఉండాలి

- జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం
- శనివారపుపేట హైస్కూల్‌లో 'నేను బడికి పోతా' ర్యాలీ



శనివారపుపేటలో ర్యాలీలో పాల్గొన్న విద్యాశాఖాధికారులు

ఏలూరు రూరల్‌/ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండాలని డీఈఓ అబ్రహం అన్నారు. నేను బడికి పోతా అనే కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యాశాఖాధికారులు శనివారపుపేట జెడ్పీ హైస్కూల్‌ పరిధిలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకోవాల్సిన వయస్సులో బాలబాలికలు పనులకు పోరాదన్నారు. ప్రభుత్వం అనేక సౌకర్యాలతో ఉచిత విద్య అందిస్తోందన్నారు. బంగారు భవిష్యత్తు కోసం పిల్లలను తల్లిదండ్రులు బడిలో చేర్చాలన్నారు. జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ బి.సోమశేఖర్‌ మాట్లాడుతూ పేద విద్యార్థులను విద్యావంతులను చేసేందుకు ప్రభుత్వం అనేక వనరులు కల్పిస్తోందన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాలను అందిపుచ్చుకుని, పిల్లలను విద్యావంతులను చేయాలన్నారు. అసిస్టెంట్‌ లేబర్‌ కమిషనర్‌ నాగేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశం బాలకార్మికులు లేని దేశంగా ఉండాలన్నారు. అప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందంజ వేస్తుందన్నారు. బడి ఈడు పిల్లలను పనుల్లో చేర్చుకోవడం నేరం అని గుర్తుచేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బాలబాలికలకు ఉచితంగా బ్యాగ్స్‌ అందించారు. హెచ్‌ఎం ఓ.ప్రకాశరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రంగయ్య, రామారావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్లకు భద్రతపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎనర్జీ అసిస్టెంట్లతో విద్యుత్‌ అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విధి నిర్వహణలో ఎనర్జీ అసిస్టెంట్లు ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలని ఈపీడీసీఎల్‌ ఏలూరు డివిజన్‌ ఈఈ జేవీబీ నటరాజన్‌ సూచించారు. శనివారం స్థానిక విద్యుత్‌ భవన్‌లో ఎనర్జీ అసిస్టెంట్లకు వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నటరాజన్‌ మాట్లాడుతూ 11 కేవీ విద్యుత్‌ లైన్లను, ఎల్‌టీ లైన్లను నిర్వహించేటప్పుడు, అలాగే విద్యుత్‌ పరివర్తకాలు నిర్వహణ, ఎర్తింగ్‌ సమయంలోనూ ఎనర్జీ అసిస్టెంట్లు జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి ఎనర్జీ అసిస్టెంటూ సంస్థకు ఎంతో అవసరమని, విధుల్లో జాగ్రత్తగా ఉంటూ భద్రతాంశాలను, అగ్ని ప్రమాదాల సమయంలో సైతం తగిన భద్రతాంశాలను పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ కే. హరింజిత గుండెకు సంబంధించిన సీపీఆర్‌పై శిక్షణ నిర్వహించగా, ఏలూరు ఫైర్‌ ఆఫీసర్‌ వి.రామకృష్ణ ఫైర్‌సేఫ్టీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్లు కె.గోపాలకృష్ణ, బీవీ కృష్ణ రాజా, డి.రామకృష్ణ, ఎస్‌ఎస్‌వీ రఘుబాబు, ఆర్‌.భీమేశ్వరరావు, పలువురు ఏఈలు పాల్గొన్నారు.

పీఎఫ్‌పై కేంద్రం తీరుతో కార్మికులకు నష్టం

ఏలూరు (టూటౌన్‌): ప్రావిడెండ్‌ ఫండ్‌ సంస్థకు కార్మికుల తరఫున చెల్లించాల్సిన సొమ్మును సకాలంలో చెల్లించని లేదా చెల్లించకుండా ఎగవేసిన యాజమాన్యాలపై, కంపెనీలపై విధించే డిఫాల్ట్‌ పెనాల్టీని భారీగా తగ్గించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌పై ఉన్న భక్తిని చాటిందని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కార్మికుల జీతాల నుంచి కట్‌ చేసిన పీఎఫ్‌, యజమాని వాటా పీఎఫ్‌లను లింక్‌ ఇన్సూరెన్స్‌ అమౌంట్‌ను ప్రావిడెంట్‌ ఫండ్‌ ఆర్గనైజేషన్‌కి ఎప్పటికప్పుడు పరిశ్రమల, కంపెనీల యాజమాన్యాలు చెల్లించాల్సి ఉందన్నారు. అలా చెల్లింపులు చేయకుండా ఆలస్యం చేసే సంస్థల, ఎగవేసే పరిశ్రమల నుంచి ఈపీఎఫ్‌ఓ సంస్థ పెనాల్టీలతో కలిపి వసూలు చేస్తుందన్నారు. ఇప్పుడు దాన్ని కనిష్ఠ, గరిష్ఠ అనే తేడా లేకుండా ఎన్ని నెలలు లేదా ఏళ్ల ఆలస్యం చేసినా 12 శాతం పెనాల్టీకి కుదించారన్నారు. దీని వల్ల జీతాలలో కోసిన పీఎఫ్‌కు యజమాని వాటా సొమ్ము కలిపి సకాలంలో చెల్లించేందుకు కంపెనీలు ఆసక్తి చూపవని, దీంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి కేంద్రం 2024 జూన్‌ 14న విడుదల చేసిన జీవో రద్దు చేయాలని, లేబర్‌ కోడ్లను ఉపసంహరించుకోవాలని వెంకట్రావు డిమాండ్‌ చేశారు.

పాఠశాలల ప్రగతికి హెచ్‌ఎంలు కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

ఏలూరు రూరల్‌: విద్యా సంవత్సరంలో చేపట్టాల్సిన ప్రగతి కార్యక్రమాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి నిలపాలని ఎంఈఓ–1 ఆర్‌.రవిప్రకాష్‌ అన్నారు. శనివారం సాయంత్రం ఏలూరు మండల పరిషత్‌ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజన పథకం, పీఎం పోర్షన్‌ అభియాన్‌, బడికి పోతా కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఎంఈఓ–2 రంగయ్య మాట్లాడుతూ 5 ఏళ్ల నుంచి 14 ఏళ్లలోపు బాలలను తప్పనిసరిగా బడిలో చేర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఇప్పటికే పాఠశాలకు చేరుకున్న పాఠ్యపుస్తకాలు, యూనిఫారం కిట్లు విద్యార్థులకు అందించాలన్నారు.

హోంగార్డుల కుటుంబాలకు అండగా ఉంటాం

- జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి
- పలు హోంగార్డు, కుటుంబాలకు చెక్కుల అందజేత



హోంగార్డుకు చెక్కును అందజేస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్‌: ఏలూరు జిల్లాలో పోలీస్‌ సంక్షేమంతోపాటు, హోంగార్డుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని, హోంగార్డుల కుటుంబాలకు తాము అండగా ఉంటామని ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్‌ ప్రధాన కార్యాలయంలో హోంగార్డులకు ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో ఎస్పీ అందజేశారు. ఏలూరు హోంగార్డు యూనిట్‌లోని సీహెచ్‌ పుల్లారావు భీమవరం సబ్‌యూనిట్‌లో హోంగార్డుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు హోంగార్డు సంక్షేమ నిధి నుంచి రూ.5లక్షల 43వేల 150 విలువైన చెక్కును హోంగార్డు పుల్లారావుకు అందజేశారు. అదేవిధంగా ఏలూరు యూనిట్‌లో హోంగార్డుగా పనిచేసిన ఎస్‌.దుర్గాప్రసాద్‌ అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయన భార్య దుర్గకు సంక్షేమ నిధి నుంచి రూ.5లక్షల 41వేల 40 విలువైన చెక్కును జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అందజేశారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు ఆటంకం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని అశోక్‌నగర్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో వివిధ ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపు విద్యుత్‌ లైన్ల వార్షిక మరమ్మతులు చేపట్టనున్న కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్‌ ఏలూరు డివిజన్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ జేవీబీ నటరాజన్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రరావు పేట, గోసంరక్షణ వీధి, పవర్‌పేట గేట్‌ ప్రాంతం, కొత్తపేట ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్‌ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.

రేపు వెంకన్న చెరువు సబ్‌స్టేషన్‌ పరిధిలో..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని వెంకన్న చెరువు విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్‌ లైన్ల వార్షిక మరమ్మతులు చేపట్టనున్న కారణంగా సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్‌ ఏలూరు డివిజన్‌ ఈఈ జేవీబీ నటరాజన్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జ్వాలా పహరేశ్వర కాలనీ, దక్షిణపు వీధి, అశోకచక్రం రోడ్డు, పోణంగి రోడ్డు, అరుంధతి పేట, పడమర వీధి, దొంగల మండపం సెంటర్‌, పాలతూము సెంటర్‌, శనగపప్పు బజారు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

వడ్డీ సొమ్ము కట్టలేదని బెల్టుతో దాడి

ఏలూరు టౌన్‌ : వడ్డీ సొమ్ము చెల్లించడంలేదనే కోపంతో ఓ వడ్డీ వ్యాపారి ఓ వ్యక్తిపై దాడి చేశాడు. వివరాలి ఉన్నాయి. ఏలూరు ఆర్‌ఆర్‌పేటకు చెందిన కనకం వీరభద్రరావు ఫ్లెక్సీ షాపులో పనిచేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం తన కుటుంబ అవసరాల నిమిత్తం ఏలూరు ఆర్‌టీఓ కార్యాలయ సమీపంలో నివాసం ఉంటున్న ప్రదీప్‌ అనే వ్యక్తి వద్ద రూ.1 లక్ష అప్పు తీసుకున్నాడు. ఇందుకోసం ప్రతి నెలా రూ.6 వేలు చొప్పున వడ్డీ చెల్లిస్తున్నాడు. గత మూడు నెలల నుంచి ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడంతో వీరభద్రరావు వడ్డీ చెల్లించడంలేదు. దీంతో వడ్డీతో పాటు అసలు తీసుకురావాలని లేదంటే తనకు ఇచ్చిన ఖాళీ చెక్కులు, ప్రాంశరీ నోట్లపై ఎక్కువ సొమ్ము వేసి కేసు వేస్తానని బెదిరించాడు. అంతేకాక శనివారం ఉదయం ప్రదీప్‌ ఇంటికి వెళ్లిన వీరభద్రరావును బెల్ట్‌తో చితకబాదాడు. వీరభద్రరావు భార్య అరుణ సహాయంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి బాధితుడు చికిత్స పొందాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

104 వాహనాల తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న స్టేట్‌ నోడల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ మురగన్‌

ఏలూరు టౌన్‌: ఏలూరు జిల్లాలో 104 వాహనాల పనితీరును స్టేట్‌ నోడల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ మురగన్‌ శనివారం పరిశీలించారు. ఏలూరు జిల్లా పరిధిలోని గుడివాకలంక, చాటపర్రు ప్రాంతాలకు సంబంధించి 104 వాహనాల పనితీరు, రికార్డులను తనిఖీ చేశారు. వాహనాల్లోని పరికరాలు, మందులు, లాగ్‌ పుస్తకాలు పరిశీలించారు. జిల్లాలో 104 సేవలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 104 జిల్లా మేనేజర్‌ తేనే విజయబాబు, ఆపరేషన్స్‌ ఎగ్జిక్యూటివ్స్‌ లంకా హరీష్‌, కొసనం కార్తీక్‌, సిబ్బంది ఉన్నారు.

ముగిసిన విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



స్వామి వారికి పవళింపు సేవ చేస్తున్న అర్చకుల బృందం



శ్రీవిశ్వేశ్వర స్వామికి విశేష అలంకరణ చేసి నైవేద్యాలు సమర్పించిన దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పవర్‌పేటలోని శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 20వ తేదీ నుంచి జరుగుతున్న స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు వసంతోత్సవం, కొట్నాలు, చూర్ణోత్సవం, త్రిశూల స్నానం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. రాత్రి 7.30 గంటల నుంచి స్వామి వారికి శ్రీ పుష్ప శయనోత్సవం (పవళింపే సేవ) అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కందుకూరి రామబ్రహ్మనంద శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా, కార్యనిర్వహణాధికారి ఎం.రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కానిస్టేబుల్‌ మృతికి సంతాపం



కానిస్టేబుల్‌ మధుకుమార్‌ (ఫైల్‌)

ఏలూరు టౌన్‌: ఏలూరు రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ కానిస్టేబుల్‌ డి.మధుకుమార్‌ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఏలూరు రాణినగర్‌ ప్రాంతానికి చెందిన మధుకుమార్‌కు భార్య, ఎనిమిదేళ్ల బాబు, మూడేళ్ల పాప ఉన్నారు. అనారోగ్యంతో గత రెండు నెలలుగా చికిత్స పొందుతూ ఏలూరులోని ఓ ఆస్పత్రిలో శనివారం ఆయన మృతి చెందారు. ఆయన మృతికి పోలీస్‌ అధికారులు, సిబ్బంది ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఏలూరు జిల్లా పోలీస్‌ అధికారుల సంఘం ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు.

ట్రాక్టర్లలో చెత్త తరలింపు

దెందులూరు: సంపూర్ణ పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా ఐదు రోజుల్లో దెందులూరు గ్రామ శివారు ప్రాంతాల్లో చెత్తను తొలగించి ట్రాక్టర్లతో తరలించామని గ్రామ కార్యదర్శి వీఎస్‌ చౌదరి అన్నారు. శనివారం ఆయన గ్రామ సచివాలయంలో మాట్లాడుతూ ఐదు రోజులుగా 12 ట్రాక్టర్లు చెత్త తరలింపునకు పనిచేస్తున్నాయని, ఒక్కొక్క ట్రాక్టర్‌ 8 ట్రిప్పులు తిరుగుతున్నట్లు తెలిపారు. పనులను మండల ఈఓఆర్‌డీ టీఎస్‌ స్వామి, దెందులూరు సర్పంచ్‌ తోట ఏసమ్మ పర్యవేక్షిస్తున్నారని కార్యదర్శి చౌదరి వివరించారు.

నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్యకు సత్కారం

పెదపాడు : అన్ని దానాల్లో కల్లా విద్యాదానం మహోన్నతమైనదని ఒక డివిజన్‌, పోలీస్‌ ఉన్నతాధికారిగా విధులు నిర్వహిస్తూనే మరోవైపు విద్యాభివృద్ధి, విద్యపై అవగాహన కోసం విశిష్ట సేవలందిస్తున్న నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య అభినందనీయమని కార్మిక సంఘ రాష్ట్ర నాయకులు కాకర్ల శ్రీను అన్నారు. శనివారం కలపర్రు టోల్‌గేట్‌ కార్యాలయంలో డీఎస్పీ లక్ష్మయ్యను ఆయన సత్కరించారు. డీఎస్పీ విధులు నిర్వహించిన ప్రతి ప్రాంతంలోనూ ఇప్పటి వరకు విద్యార్థులకు, యువతకు, ఎన్‌జీవోలకు ఉచితంగా జీకే, సైకాలజీ, వివిధ కవులు రాసిన రచనలు దాదాపు 1,272 పుస్తకాలు అందించి పలువురు మన్ననలు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇతరుల విద్యాభివృద్ధి, కుటుంబాభివృద్ధి, సమాజాభివృద్ధి కోసం కొంతైనా స్వచ్ఛంద సేవ చేస్తే ప్రతి ప్రాంతం, ప్రతి కుటుంబం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. డీఎస్పీ లక్ష్మయ్య స్ఫూర్తితో నేటి యువత, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఎన్‌జీవోలు, తమ వంతు విద్యాభివృద్ధి కోసం సేవలందించాలని కాకర్ల శ్రీను అన్నారు. అనంతరం శాలువా, పూలదండ, జ్ఞాపికతో డీఎస్పీని సత్కరించారు.

పునాది ధ్వంసంపై ఫిర్యాదు

పెదవేగి : పిల్లర్ల దశ ఉన్న అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారంటూ ఐసీడీఎస్‌ సీడీపీఓ విజయలక్ష్మి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వీ రాజేంద్రప్రసాద్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భోగాపురంలో రెండో నంబర్‌ అంగన్‌వాడీ కేంద్రం కొన్నేళ్లుగా పునాది, పిల్లర్ల దశలోనే ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు నిర్మాణంలో ఉన్న భవనాన్ని ధ్వంసం చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్‌ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	16
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ (అమరావతి)	22.00	17
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌ (అమరావతి)	22.30	34
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్‌ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్‌ నంబర్‌	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌	21.45	4820	15
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌	21,.15	4822	18
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌ వయా కే.కోట	19.30	4796	06
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ వయా రామచంద్రపురం	19.45	4798	12
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం	20.30	4800	16
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	17
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	16
ఏలూరు – ఈసీఐఎల్‌	22.30	4814	17
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం	20.20	98511	16
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌	21.10	98503	14
ఏలూరు – తిరుపతి	16.00	4830	31

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	64	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	54	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	54	ములక్కాడలు	07, 10
బెండకాయలు	54	కంద	64
పచ్చిమిర్చి	46	బీట్‌రూట్‌	40
కాకర కాయలు	48–64	కీరా దోస	46
బీరకాయలు	48	ఫ్రెంచ్‌బీన్స్‌	--
బీరకాయలు (పందిరి)	60	అల్లం	180
క్యాబేజీ	42	కొత్తిమీర (కట్ట)	20–40
క్యారెట్‌	40–56	పాలకూర	12
దొండకాయలు	30	చుక్కకూర	12
బంగాళదుంపలు	36	తోటకూర	10
ఉల్లిపాయలు	38–40	గోంగూర	07
గోరుచిక్కుడు	--	పుదీనా	05
దోసకాయలు	26	బఠాణి	--
అనబకాయ (1)	15–20	క్యాప్సికమ్‌	--
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	58

ఉద్యోగావకాశాలు కల్పించడమే జాబ్‌మేళా లక్ష్యం

- నారాయణపురంలో 14 కంపెనీల రాక
- 76 మంది ఉద్యోగాలకు ఎంపిక



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

ఉంగుటూరు: ప్రతిష్టాత్మక కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు జాబ్‌మేళాలు ద్వారా కల్పించడం జరుగుతోందని నేషనల్‌ కెరియర్‌ సర్వీసెస్‌, కో–ఆర్డినేటర్‌, ఏలూరు జిల్లా యంగ్‌ ప్రొఫెషనల్‌ జి.ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. శనివారం నారాయణపురం ఎస్‌ఏఎస్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ప్రవీణ్‌కుమార్‌ మాట్లాడుతూ కష్టపడేతత్వం యువకులు అలవర్చుకోవాలన్నారు. సర్పంచి దిడ్ల అలకానంద మాట్లాడుతూ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని కోరారు. సెట్‌వెల్‌ సీఈవో మెహర్‌రాజు మాట్లాడుతూ ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జాబ్‌మేళాలు నిర్వహిస్తామని వివరించారు. ఎంప్లాయిమెంటు జిల్లా ఆఫీసరు వరలక్ష్మి, మోడల్‌ రిసోర్సు సెంటర్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సామర్థ్యం కలిగిన వారి కోసం కంపెనీలు ఎదురు చూస్తున్నాయని అన్నారు. ప్రిన్సిపాల్‌ టీకే విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తమ కళాశాలలో జాబ్‌ మేళా నిర్వహించడం మంచి పరిణామమన్నారు. నిరుద్యోగులకు, కంపెనీల ప్రతినిధులకు సర్పంచి అలకానంద శ్రీనివాస్‌ ఉచిత భోజనాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. సర్పంచి అలకానంద శ్రీనివాసరావును సత్కరించారు. వివిధ కంపెనీల సీఈవోలు మేనేజర్లు కంపెనీల్లో ఉన్న ఖాళీలు, జీతాలను వివరించారు. జాబ్‌ మేళాకు 183 మందికి పైగా హాజరుకాగా 76 మందికి ప్లేస్‌మెంట్స్‌ లభించాయి. అపాక్‌ ఫైనాన్సు, పేటియం, మోహన్‌ స్పింటెక్స్‌, అపోలా టైర్సు, లైఫ్‌ ఇన్సురెన్సు కార్పొరేషన్‌, ముత్తూట్‌ మినీ మ్యాక్సు సెక్యూరిటీస్‌, రెడ్డిఅండ్‌రెడ్డి మోటార్స్‌, టాటా మోటార్స్‌ తదితర కంపెనీలు హాజరయ్యాయి. తాడేపల్లిగూడెం డియర్‌ గోయంకా కళాశాల విద్యార్థులు 18 మంది, గణపవరం గవర్నమెంటు డిగ్రీ కళాశాల విద్యార్థులు 12 మంది, జంగారెడ్డిగూడెం, బుట్టాయిగూడెం, చింతలపూడి, ఏలూరు కళాశాలలకు చెందిన విద్యార్థులు అధ్యాపకుల హాజరయ్యారు.